ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న జ్ఞానేశ్వర్, ప్రకాశ్‌గౌడ్, నరసింహారెడ్డి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పుట్టినరోజ వేడుకలను రాజేంద్రనగర్ జోన్ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పర్‌పల్లి వద్ద తలసేమియాతో బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు అందజేశారు. పేదలకు నూతన వస్త్రాలను బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా సహస్రార్జున మహరాజ్ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న సమాజ్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో శుక్రవారం ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహరాజ్ జయంతిని పట్కర్(ఖత్రి) సమాజ్ సభ్యులు అత్యంత భక్తి శ్రద్దలతో, ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించుకున్నారు. పురాణ యోధుడు, కులదైవం, మూలపురుషుడైన మహిష్మతి రాజ్య మహా చక్రవర్తి శ్రీ సహస్రార్జున మహరాజ్ జయంతిని ఉత్సవాన్ని ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఘనంగా నిర్వహించుకుంటారు. శ్రీ మహా విష్ణువు సుదర్శన చక్ర అవతారమైన శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజు ఈ భువిపై చెడును అంతమొదించి ధర్మాన్ని నిలబెట్టడానికి అవతరించాడని పునఃస్మరణ చేసుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ డాక్టర్ శ్రీ గురు ప్రసాద్ సుల్తాన్ పూర్కర్ మాట్లాడుతూ... మహాబలశాలి సహస్రార్జునుడి గుణగణాలను శ్లాఘిస్తూ ఆయన వంశానికి చెందిన ఎస్ఎస్ కియన్స్ తమ తమ మేధో నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలను ఉపయోగించి వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. రాజేంద్రనగర్ సమాజం ప్రజలందరూ చేయి చేయి కలుపుతూ సమాజం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొని మన ఐక్యతను చాటుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు ఉమేశ్ చౌహాన్, ముఖ్య కార్యదర్శి రాజేశ్ హబీబ్, సంయుక్త కార్యదర్శి మహేశ్ చవాన్, కమిటీ సభ్యులు రమాకాంత్ హౌజి, సలహాదారులు శ్రీరామలాల్ చవాన్, గాంబో నాగరాజు, రాజ్ కుమార్ జ్యోతి, దత్తారాం పడాల్, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ దివాన్ రాకేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు గాయత్రి చవాన్, సంయుక్త కార్యదర్శి శారదా హబీబ్, సమాజ్‌కు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో త్రిశూలం తొలగింపు

- యువకుడిని పోలీసులకు అప్పగించిన భక్తులు
- అమ్మ చెబితే చేశానన్న యువకుడు



తొలగించిన త్రిశూలం



నిందితుడు

శంషాబాద్: పట్టణంలో నవగ్రహాల ధ్వంసం ఘటన కొలిక్కిరాక ముందే కట్టమైసమ్మ దేవాలయంలో ఓ యువకుడు ప్రవర్తించిన తీరు కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధాంతి కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ముందు ఉన్న త్రిశూలం తీసి కింద పారేస్తుండగా స్థానికులు గమనించి వెంటనే అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఎందుకు చేశావని స్థానికులు ప్రశ్నించగా అమ్మచెబితేనే చేశానంటూ సమాధానం ఇచ్చాడు. అతడి మానసిక స్థితి కూడా సరిగా లేకపోవడంతో సరైన సమాధానం ఇవ్వకుండా స్థానికులను ఆగ్రహం తెప్పించాడు. ఆర్‌జీఐఏ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారు. మరోవైపు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఎయిర్‌పోర్టు కాలనీలోని ధ్వంసమైన నవగ్రహాలను పరిశీలించడానికి వచ్చేముందే ఈ ఘటన జరగడంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది.

రెడీమిక్స్ ప్లాంట్లను తొలగించాల్సిందే..



కాలుష్య నియంత్రణ మండలి విచారణలో పాల్గొన్న నివాసితులు, నాయకులు

మణికొండ: వేలాది మంది ప్రజలు నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీలను ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా రెడీమిక్స్ ప్లాంట్లను కొనసాగిస్తూ స్థానికుల ఆరోగ్యాలకు ఇబ్బందిని కలిగిస్తున్న వాటిని తొలగించాల్సిందేనని నివాసితులు మరోమారు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు మొరపెట్టుకున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అపార్ట్‌మెంట్స్, హాల్‌మార్క్ వినిసియా అపార్ట్‌మెంట్‌ల పక్కనే నిర్మాణంలో ఉన్న మరో సంస్థ నిబంధనలకు విరుద్ధంగా రెడీమిక్స్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వాటి నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి, శబ్దాలతో వాటిల్లో నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విషయాన్ని గతంలో వారికి ఫిర్యాదు చేశారు. దాంతో శుక్రవారం ఇరు వర్గాలను పిలిచి విచారణ చేశారు. ఈ సందర్భంగా నివాసితులు ఎట్టి పరిస్థితిలోను వాటిని తొలగించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, వాటికి పూర్తి బాధ్యత కాలుష్య నియంత్రణ మండలి వారే తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు జి.రవి, కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు డి.సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, నాయకులు షేక్ ఆరీఫ్, ఎ.లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, నివాసితులు గౌతంరెడ్డి, గోపాలరావు, సుబ్బారెడ్డి, నారాయణ, రవి, అప్పారావు, నాగరాజు, సుధాకర్, సురేందర్‌రెడ్డి, సురేష్ దినేష్, అభిషేక్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఘనంగా గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే



ఎన్‌క్రిప్షన్‌డేలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు తదితరులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే–2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ (ఎస్‌సీఐఎస్) హెచ్‌సీయూ ఇంటర్నెట్ సొసైటీ (ఐఎస్ఓసీ హైదరాబాద్ చాప్టర్ సహకారంలో ఈ గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే–2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ... డిజిటల్ సామాజిక అవగాహనను కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహాయపడుతుందన్నారు. గోప్యతా అవసరాలను తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. గణిత శాస్త్రవేత్తలు, భద్రతా నిపుణులు, ఎన్‌క్రిప్షన్, క్రిప్టోగ్రఫీ, క్వాంటం కమ్యూనికేషన్‌ల ద్వారా వివిధ భద్రతా అవసరాలను పరిశీలించాలన్నారు. రాబోయే 20–30 సంవత్సరాలకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఐఎస్ఓసీ అధ్యక్షుడు కె.మోహన్‌రాయుడు మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీలో అపారమైన వృద్ధి ఉన్నందున సమగ్రతను నిర్ధారించడానికి ఎన్‌క్రిప్షన్‌ల ప్రాముఖ్యతను పెంచామన్నారు. ప్రస్తుతం ఎన్‌క్రిప్షన్ ప్రాథమిక హక్కుగా మారాలని ఆయన సూచించారు. ఎస్‌సీఐఎస్ డీన్ ప్రొఫెసర్ అతుల్ నేగి, ఈ వెంట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.రుక్మరేఖ తదితరులు మాట్లాడారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రసిద్ధి..

శివబాగ్ క్షేత్రం

జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో కొలువుదీరిన మహా శివుడు



- గోమాతలకు నిలయం
- నిరుపేదలకు నిత్యాన్నదానం
- కార్తీక మాసం కావడంతో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు



జియాగూడ: జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో కార్తీక మాసంలో 12 జ్యోతిర్లింగాల దర్శనాల కోసం ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుంటున్నారు. 12 జ్యోతిర్లింగాలు ఆశ్రమం నలు దిక్కులా వ్యాపించి మహా పుణ్యక్షేత్రంగా శివబాగ్‌గా ఖ్యాతి గాంచింది. ఆలయాలలో ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తారు.

12 జ్యోతిర్లింగాలు..

శివబాగ్‌గా పేరుగాంచిన ఆశ్రమంలో తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ, ఈశాన్యం నైరుతి, ఆగ్నేయం దిశలలో 12 జ్యోతిర్లింగాలను స్థాపించారు. ముఖ్యంగా అమరేశ్వరుడు, ఋుతేశ్వరుడు, ముక్తేశ్వరుడు, కాశీవిశ్వనాథుడు, రామేశ్వరుడు, సోమనాథేశ్వరుడు, వైద్యనాథేశ్వరుడు, నాగేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, హరిహరేశ్వరుడు, భీమేశ్వరుడు, కేదరేశ్వరుడు, స్ఫటిక లింగం, మహాశివుడు తదితర శివలింగాలు కొలువుదీరి ఉండడంతో సమర్థ నారాయణ ఆశ్రమం భక్తులతో విరాజిల్లుతుంది.

విశాలమైన కామధేను గోశాల..

భారత దేశంలో ఎక్కడ గోమాత ఆలయం లేదు. సమర్థ నారాయణ ఆశ్రమంలో గోమాత కొమ్ముల మధ్య నుంచి అమరేశ్వరుడిని దర్శించుకోవడం భక్తులు అదృష్టంగా భావిస్తారు. ఈ విశాలవంతమైన ఆశ్రమంలో సుమారు 6 వేలకు పైగా గోవులు సేదా తీరుతున్నాయని ఆశ్రమ 12వ పీఠాధిపతి ప్రభు దత్త మహారాజ్ తెలిపారు.



ఒకే పానపట్టంపై కొలువుదీరిన హరిహరేశ్వరులు





శివబాగ్ ఆలయాలలో కొలువుతీరిన జ్యోతిర్లింగాలు

రేషన్ బియ్యం పట్టివేత

గచ్చిబౌలి: ఎల్‌బీనగర్ నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 230 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ... రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందడంతో శుక్రవారం మధ్యాహ్నం గచ్చిబౌలి పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు ఓఆర్‌ఆర్‌పై వెళ్తున్న లారీపై దాడి చేశారు. కోకాపేట్ మూవీ టవర్స్ సమీపంలో ఓఆర్‌ఆర్‌పై లారీని స్వాధీనం చేసుకున్నారు. 230 క్వింటాల బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తామని ఎస్ఐ సాయినాథ్ తెలిపారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి హైస్కూల్‌లో ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ శుక్రవారం నిర్వహించారు. ఫైర్ సెక్యూరిటీ విభాగం ఇంచార్జీ నీలేష్ గోఖే ఎన్ని రకాల మంటలు తలెత్తుతాయో, ఆ మంటలు వచ్చినప్పుడు సమయస్ఫూర్తితో వాటిని ఎలా అదుపులోకి తీసుకరావాలో విద్యార్థులకు మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. మాక్ డ్రిల్‌లో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి ఏ విధంగా స్పందించాలో తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ బాలాత్రిపురసుందరి ఫైర్ సిబ్బందిని అభినందించారు.

11 మంది హిజ్రాల బైండోవర్

గచ్చిబౌలి: రాత్రి వేళల్లో రోడ్లపై హిజ్రాలు నిలబడి అటుగా వెళ్లే ప్రయాణికులను ఆకర్షిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో సైబరాబాద్ యాంటి హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ పోలీసులు పలు చోట్ల దాడులు చేశారు. గురువారం రాత్రి ఇన్‌స్పెక్టర్ జేమ్స్ బాబు ఆధ్వర్యంలో బొకియా కూడలిలో తొమ్మిది మంది, కై త్లాపూర్‌లో ఇద్దరు హిజ్రాలను అదుపులోకి తీసుకొని మాదాపూర్, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. 11 మంది హిజ్రాలను ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. హిజ్రాలు ప్రయాణికులను ఆకర్షించినా, డబ్బులు వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిరంతరం దాడులు చేస్తామని ఇన్‌స్పెక్టర్ జేమ్స్ బాబు హెచ్చరించారు.

ఓఆర్‌ఆర్‌పై కంకర లారీ బోల్తా



ఓఆర్‌ఆర్‌పై పల్టీ కొట్టిన లారీ

మణికొండ: ఓవర్ లోడుతో వెలుతున్న ఓ లారీ టైరు పగిలి ఔటర్ రింగ్ రోడ్డుపై బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పక్కనే శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పోలీస్ అకాడమీ నుంచి కోకాపేటకు కంకర లోడుతో వెలుతున్న లారీ నార్సింగి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ఒక్కసారిగా టైరు పేలింది. దాంతో అదుపు తప్పిన లారీ ఔటర్ రింగ్ రోడ్డుపైనే పల్టీ కొట్టింది. ఆ సమయంలో వెనక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న నార్సింగి ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ సునీల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి రెండు క్రేన్‌ల సహాయంతో లారీని పక్కకు తప్పించారు. రెండు గంటల పాటు ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఓవర్‌లోడ్‌తో, నో ఎంట్రీ ప్రాంతాలలో ఇలాంటి భారీ వాహనాలు తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులతో పాటు ఆర్టీఏ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అలాంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా నిమిత్తం గగన్ పహాడ్, మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సెక్షన్ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు పద్మశాలీపురం, దుర్గానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మధుబన్ కాలనీ, పద్మశాలీపురం, ఆప్కో కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, వినాయక్ నగర్, దుర్గానగర్, గణేష్ నగర్, శాంతినగర్‌లలో విద్యుత్ ఉండదన్నారు. దుర్గాహిల్స్‌లో శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని జల్‌పల్లి పారిశ్రామికవాడ, శివాజీ నగర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయేషానగర్, అలీనగర్, అహ్మద్ నగర్, మిలాన్ కాలనీలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. తమిళ్‌బస్తీ పరిధిలోలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు టాటానగర్, బృందావన్ కాలనీ, ప్రగతికాలనీలలో విద్యుత్ ఉండదన్నారు.

హిమాయత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అమర్‌సింగ్ తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిట్రీస్ ఫేస్–2, పావనీ హార్మోనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మాధవినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్, ఎస్సీ బస్తీ, హైదర్షాకోట్ విలేజ్, మాధవినగడర్, శ్రీరామ్‌నగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



క్యామ మల్లేష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర కురువ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్‌ఎస్ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జ్ క్యామ మల్లేష్ అన్నారు. శుక్రవారం బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ. 9 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వారాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోచమ్మ దేవాలయ అభివృద్ధికి కురువ సంఘం సభ్యులు కృషిని అభినందించారు. ప్రతి కాలనీలో దేవాలయాలు నిర్మించుకొని ప్రజలలో భక్తి భావం పెంచాలని అన్నారు. యువత భక్తి మార్గం వైపు నడవడానికి దేవాలయ నిర్మాణాలు ఎంతో దోహదపడుతాయని అని పేర్కొన్నారు. కాలనీలో దేవాలయాలతో పాటు కమ్యూనిటీలు, పాఠశాలలు కూడా దత్తత తీసుకొని అభివృద్ధి చేసుకుంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం దేవాలయ ముఖద్వారం ఏర్పాటుకు సహకరించిన దాతలకు మెమొంటోలను ప్రదానం చేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉప్పల్ శీను, కరువ లక్ష్మణ్, కరువ కిష్టప్ప, కరువ మహదేవ్, వెంకటేష్, హనుమంతు, పోతురాజు మల్లేష్, జగన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్



మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీ ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా పొంగుతున్న మురుగు నీరు సమస్య తాత్కాలికంగా జలమండలి అధికారులు పరిష్కరించారు. శుక్రవారం జలమండలి డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ వినయ్ కుమార్, సిబ్బందితో మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు నీటిని పక్కనే ఉన్న కాలువలోకి పైప్‌లైన్ ద్వారా తరలించి సమస్యను పరిష్కరించారు. అవుట్ లెట్ సరిగా లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కాలనీ రహదారిలో ఎలాంటి మురుగు నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. తద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

దేవర కరుణాకర్ సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: దివంగత బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలను వెలకట్టలేమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. దేవర కరుణాకర్ కుమారుడు దేవర వంశీ నిర్వహిస్తున్న కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఆహ్వాన పత్రికను శుక్రవారం గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ ఓబీసీ విభాగం ప్రధాన కార్యదర్శి రాజారామ్ నాగరాజు కేంద్ర మంత్రికి అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా దేవర కరుణాకర్ పార్టీ ప్రతిష్టతకు అలుపెరుగకుండా కృషి చేశారని అన్నారు.

ఇన్సాఫ్ రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: శంషాబాద్ మండల కేంద్రంలోని ఎలైట్ హోటల్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్సాఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎ.రియాజ్, అధ్యక్షుడిగా మహ్మద్ మక్బూల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ షకీల్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ మోయిన్, షేక్ మునావర్, షేక్ అహ్మద్, మహ్మద్ హుస్సేన్, మహ్మద్ యూసుఫ్‌లను ఎన్నుకున్నారు.

విధుల్లో సమయ పాలన పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ డ్రైవర్లతో కమిషనర్ బి.శరత్‌చంద్ర సమావేశమయ్యారు. కాళీమందిర్ సమీపంలో ఉదయం 5 గంటలకు శానిటేషన్ డ్రైవర్లతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ ఆదేశాలను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల్లో ముమ్మర తనిఖీలు



వెంకటేశ్వర కిరణా దుకాణానికి జరిమానా విధిస్తున్న ఆర్ఐ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లోని దుకాణాల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వెంకటేశ్వర కిరణ జనరల్ స్టోర్‌లో తనిఖీలు చేపట్టారు. ఎక్స్‌ప్యారీ పూర్తి అయిన కూల్ డ్రింక్స్‌ను అధికారులు గుర్తించారు. షాపు యజమానికి రూ. 1000 జరిమానా విధించి మరోసారి నిర్లక్ష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ కె.శివకుమార్ హెచ్చరించారు. తనిఖీల్లో బిల్ కలెక్టర్ సైదులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



శాంతినగర్‌లో డోర్ స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా డోర్ స్టిక్కరింగ్ ప్రక్రియ బండ్లగూడ జాగీరు పురపాలక సంఘం పరిధిలో కొనసాగుతోంది. ఈ ప్రక్రియను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర శుక్రవారం పరిశీలించారు. 3వ డివిజన్‌లో కుక్కల మాన్యం, శాంతినగర్ కాలనీ, 6వ డివిజన్ మధుపార్క్, అపార్ట్‌మెంట్‌లలో కార్యక్రమాన్ని పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, మేనేజర్ ఈ.మంజులత, ఆర్ఐ కె.శివకుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు



వనభోజనాలలో పాల్గొన్న మహిళలు

మణికొండ: కార్తీకమాసం సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్‌కు చెందిన మహిళలు ఎంజీ పార్కులో శుక్రవారం వనభోజన కార్యక్రమాన్ని సంగడిగా నిర్వహించారు. శ్రీలలిత సహస్తనామం, లింగాష్టకం, సౌందర్యలహరి, శివానందలహరి లాంటి సంకీర్తనలు పఠించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు పద్మ మాట్లాడుతూ... కార్తీక మాసంలో ప్రకృతిలో ఒక రోజు గడపటం, అక్కడే భోజనం చేయటం అనాదిగా వస్తుందన్నారు. గడచిన ఐదు సంవత్సవాలుగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ సెక్యూరిటీపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డెల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ వారు డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా వాడే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డెల్ టెక్నాలిజీ కార్యాలయ సందర్శనకు 15 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్కూలు బ్యాగులు, సైకిళ్లను పంపిణీ చేశారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు